క్లుప్తంగా

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్



వాజేడు: భూ వివాదంలో అన్న మొడెం చంటి (36)ను హత్య చేసిన తమ్ముడు మొడెం శివాజీని శనివారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెంకటాపురం(కె) ఇన్‌చార్జ్ సీఐ రాజు, వాజేడు ఎస్సై రేక అశోక్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి పెట్రోల్‌బంక్ సమీపంలో శివాజీ తచ్చాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి అతడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరు సాక్షుల సమక్షంలో అన్నను హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు వారు తెలిపారు. తమ తండ్రి ఇచ్చిన ఎకరం భూమి మొత్తం తనేకే కావాలని గతకొంత కాలంగా అన్న చంటి, తనతో పాటు తల్లిదండ్రులను మద్యం తాగి వచ్చి కొట్టేవాడన్నారు. ఆ బాధ భరించలేక తన ఇంట్లో ఉన్న కత్తితో అన్నను పొడిచి చంపినట్లు శివాజీ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్ నిమిత్తం ములుగు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

క్లస్టర్ల ప్రకారం నిర్వహించాలి

వెంకటాపురం(కె): పెసా గ్రామ సభలను క్లస్టర్ల ప్రకారం నిర్వహించాలని తుడుం దెబ్బ జాతీయ కో కన్వీనర్ యాసం రాజు అన్నారు. పూజారిగుడెం గ్రామ సభలో ఎలాంటి గొడవలు జరగకుండా చూడాలని శనివారం కోరుతూ స్థానిక ఎస్సై తిరుపతిరావుకు గరామ కొమ్ముల గిరిజన ఇసుక సొసైటి, గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందించారు. పూజారి గూడెం పెసా గ్రామ సభలో అలజడులు జరిగే అవకాశం ఉందన్నారు. స్థానిక పోలీసులు బందోబస్తు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల బిక్షపతి, యాసం సమ్మయ్య, నాగేష్, రమేష్, నాగరత్నం తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

ఏటూరునాగారం: ట్రాక్టర్ ఢీకొని వృద్ధరాలు మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని ముళ్లకట్టలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ముళ్లకట్టకు చెందిన కొడిపె రాజు కిరాణం షాపు వద్ద కొడిపె సమ్మక్క(80) కూర్చొని వారితో మాట్లాడుతుంది. అదే గ్రామానికి చెందిన కొడిపె రాములు ట్రాక్టర్ నడుపుకుంటూ వచ్చి ఆ కిరాణం షాపు వద్ద ఉన్న రోడ్డుపై నిలిపి గ్రామ పంచాయతీ వద్ద జరుగుతున్న ఓ పంచాయతీకి వెళ్లాడు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన వావిలాల రమేష్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవింగ్ రాకున్నప్పటికీ ట్రాక్టర్‌ను స్టాట్ చేసి నడుపగా అదుపుతప్పి సమ్మక్కను ఢీకొట్టింది. దీంతో సమ్మక్క కుడికాలుకు, తలకు బలమైన గాయం అయ్యింది. సమ్మక్కను ములుగు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుమారుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కావాలి



హన్మకొండ: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు రావాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల నుంచి నాయకత్వం ఎదగాలంటే అసెంబ్లీ, పార్లమెంటులలో బీసీలు అడుగు పెట్టాలన్నారు. అందుకు అనుకూలంగా చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం చిన్న రాజ్యాంగ సవరణ జరగాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల మాదిరిగా చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రధాని మోదీ సహకరించాలని కోరారు. వరంగల్‌లోని టెక్స్‌టైల్స్ పార్కును ప్రధాని ప్రారంభించకపోవడాన్ని సురేష్ తప్పుబట్టారు. పీఎం మిత్ర పథకానికి అధికారిక అనుమతులివ్వని రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సాయిబాబా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఈదునూరి రాజమొగిళి, నాయకులు యుగేందర్ పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

టేకుమట్ల(రేగొండ): మండలంలోని నారాయణపూర్ శివారులో ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు శనివారం గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని నారాయణపూర్ నుంచి బానోతు వీరునాయక్, కైకా అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రేగొండకు గుడుంబాను తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 8లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ రఘుపతి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, విష్ణు, విజయ్‌కుమార్ ఉన్నారు.

ముందస్తు అరెస్టులు పిరికి చర్య



ములుగు రూరల్: అరెస్టయిన నాయకులు



ఏటూరునాగారం: అరెస్టయిన వివిధ పార్టీల నాయకులు

ములుగు: నగరంలో ప్రధానమంత్రి మోదీ పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం పిరిచి చర్య అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలు పోలీస్‌లు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం హేయమైన చర్య అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఆకుతోట చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం హేయమైన చర్యని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, ఎల్లారెడ్డి, దాసరి సుధాకర్, ప్రభాకర్, క్రాంతి, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): దేశ ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో మండలంలోని వివిధ పార్టీల నేతలను శనివారం ఉదయం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటితో పాటు కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, నల్లా కోటి, విపక్ష పార్టీల నాయకులు అలువాల అయిలయ్య, బొమ్మెడ సాంబయ్య, శ్యాం, నర్సయ్యలను అదుపులోకి తీసుకున్నారు.

ఏటూరునాగారం: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రధానమంత్రి మోదీ సభ సందర్భంగా తమను అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నాయకుడు వావిలాల స్వామి అన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న తమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడం హేయమైన చర్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం చేయడం సరియైన పద్ధతికాదని, దానిని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సై కృష్ణప్రసాద్ ఉదయం 5 గంటలకే తమను అదుపులోకి తీసుకొని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఎమ్మార్పీఎస్, డీఎస్పీ నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. సీపీఎం నాయకులు దావూద్, గడ్డం భిక్షపతి, సురేష్, శంకర్, లక్ష్మణ్, రాజు అరెస్టెయిన వారిలో వారిలో ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమం



ఎస్‌ఎస్‌తాడ్వాయి: సంఘీభావం తెలుపుతున్న నాయకులు



వాజేడు: సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



వెంకటాపురం(కె) సమ్మె చేస్తున్న కార్మికులు

ఎస్ఎస్ తాడ్వాయి: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులు, సిబ్బంది, ఉద్యోగులు తేల్చి చెప్పారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది చేపడుతున్న సమ్మె శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గజ్జెల ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు నరేందర్, కార్మిక సంఘం నాయకులు జనార్దన్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

వాజేడు: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం మూడో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమకు 60 పద్దు ద్వార జీతాలు ఇవ్వాలని, కారోబార్‌లను సహాయక కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని, జీతాలను పెంచాలని నినాదాలు చేశారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మద్దతు తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, రంజిత్, తాటి శ్రీను, దేవర కొండ లక్ష్మణరావు, సమ్మయ్య, శ్రీను, అనూష తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



ములుగు రూరల్: వైఎస్సార్ జయంతి సందర్భంగా స్వీట్లు తినుపిస్తున్న నాయకులు

ములుగు రూరల్/కన్నాయిగూడెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కన్నాయిగూడెం వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు కల్వచర్ల భిక్షపతి అన్నారు. వైఎస్సార్ 74వ జయంతి వేడుకలను శనివారం గోవిందరావుపేట మండల కేంద్రంతో పాటు కన్నాయిగూడెంలో వేర్వరుగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నిరుపేదలకు అండగా ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన మహా నేత వైఎస్సార్ అన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహోన్నత నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం, 108, 104 సేవలకు శ్రీకారం చుట్టిన వైఎస్సార్ ప్రజల మదిలో పదిలంగా ఉన్నారని అన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ, నిరుపేదల విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షల మంది ఉచిత వైద్యసేవలు పొందుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, సీతారాంనాయక్, పన్నాల ఎల్లారెడ్డి, దాసరి సుధాకర్, జంపాల ప్రభాకర్, నాగేందర్‌రావు, సారయ్య తదితరలు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ములుగు రూరల్: మండలంలోని జాకారం గ్రామానికి చెందిన రుద్రబోయిన రఘుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా 1998 సంవత్సరంలో అబ్బాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అతనితో కలిసి పదోతరగతి చదివిన తోటి స్నేహితులు శనివారం బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు. తలోకొంత పోగుచేసి రూ. 40 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద శ్రీనివాస్, సామంతుల కోటి, శ్రీనివాస్, మహేందర్, రాజేందర్, కుమారస్వామి, భాస్కర్, రంజిత్‌లతో పాటు జాకారం, కొత్తపల్లి, అబ్బాపూర్‌కు చెందిన మిత్రులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇర్సవడ్ల వెంకన్న

ఏటూరునాగారం: మండలంలోని విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్నలు కోరారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రొయ్యూర్‌లో కరెంటు వైర్ తెగి 16 పాడిగేదెలు మృతి చెందడం బాధకరమన్నారు. గేదెలను కొల్పోయిన రైతులకు విద్యుత్‌శాఖ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ల వద్ద బట్టలు ఆరవేసే సమయమంలో విద్యుత్ వైర్లను గ్రహించాలని కోరారు. పొలాల్లో మోటార్లు, స్టాటర్ల వద్ద జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు, సులేమాన్, శ్రీనివాస్, మధు, వసంత శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



ఎంపీతో పాటు దీక్షలో కూర్చున్న నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం వన దేవతలైన సమ్మక్క సారలమ్మల స్ఫూర్తితో పోరాడతామని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రహమాన్ అన్నారు. మేడారం అమ్మవార్ల సన్నిధిలో శనివారం ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులను కలిసి గిరిజన యూనివర్సిటీ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో యూనివర్సిటీల కోసం అనేక ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి సాగర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ ఎంపీ సీతారామ్‌నాయక్ చేపట్టిన దీక్షకు శనివారం వారు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గిరిజన విశ్వవిద్యాలయంను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, కావిరి చిన్నికృష్ణ, మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్ పొడెం శోభన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ కూలీ మృతి



షేక్‌బాషా (ఫైల్)

ఏటూరునాగారం: సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టబోయి ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చెందిన రోడ్డు నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలో శనివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్టం పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లెకు చెందిన షేక్ బాషా (55) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్–రామన్నగూడెం గ్రామాల మధ్య పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని కాంట్రాక్టర్ ద్వారా చేపడుతున్న రిటైనింగ్ వాల్‌పనుల కోసం షేక్ బాషాతో కలిసి మరికొంత మంది మేస్త్రీలు, కూలీలు నెల క్రితం ఆంధ్ర నుంచి ఇక్కడికి వచ్చారు. పనులు చేసుకుంటూ చిన్న గుడిసెలో ఉంటున్నారు. శనివారం ఉదయం రామన్నగూడెం గ్రామానికి చెందిన సోమేశ్వర్‌రావు రైతు ఇంటిలో సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకునేందుకు అక్కడి వెళ్లాడు. అప్పటికే గ్రామంలో 11 కేవీ వైర్ తెగి ఎల్‌టీ లైన్‌పై పడి ఉండడంతో విద్యుత్ సరఫరామూడు రెట్ల హై ఓల్టేజీతో విద్యుత్ బోర్డులోకి వచ్చింది. ఈ విషయం తెలియని షేక్‌బాషా చార్జింగ్ బోర్డులో పెట్టగానే ఒకేసారి అడాప్టర్ పేలిపోయి అతనికి షాక్ తగిలి కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు వచ్చేసరికి అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు లైన్‌మెన్ రాజమౌళికి సమాచారం ఇవ్వగా జూనియర్ లైన్‌మెన్ రాజు, రాజమౌళి వచ్చి సరఫరా నిలిపివేసి వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేశారు. కాంట్రాక్టర్ చిప్ప అశోక్ పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బతుకుదెరువుకు కోసం వచ్చి కుటుంబ పెద్దను కోల్పోయామని వారి రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. కాగా మృతుడికి భార్య జమీలా, కుమార్తె జరీనా, కుమారుడు సర్దార్ ఉన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ తీస్తున్న నాయకులు



పస్రాలో ర్యాలీ నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, సీపీఎం నాయకులు

ములుగు: రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీ విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రం బంద్ ప్రటించినట్లు వెల్లడించారు. బంద్‌లో పాల్గొని సహకరించిన ప్రతీ ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమై తరగతులు ప్రారంభం కూడా జరుగుతున్నాయని, తెలంగాణలో ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భ్రష్టు పట్టిస్తున్నాయని ఆరోపించారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయితే ఉన్నత చదువులు చదవాలని ఆశిస్తున్న వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ఏడాది తరగతులు ప్రారంభం కాని పక్షంలో ఎమ్మెల్యే సీతక్క ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్‌కుమార్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, కంబాల రవి, జక్కుల రేవంత్ యాదవ్, షకీల్, బోడ రఘు, తదితరులు పాల్గొన్నారు. వెల్లడించారు.

ములుగు రూరల్: రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గోవిందరావుపేట మండలం పస్రాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆవాస్‌యోజన పథకంలో భాగంగా అర్హులైన నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలకు అందించాలని అన్నారు. విభజన హామీలైన గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పెట్టుబడిదారులకు, అంబానీ, అధానిలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. కేంద్రంతో మోదీ ప్రభుత్వం పెత్తందార్లకు పనిచేస్తుంటే, రాష్ట్రంలో దోపిడి పాలన జరుగుతుందన్నారు. సంజీవ, నాగరాజు, సూర్యనారాయణ, రమేష్, సీతారామరాజు, కవిత, రజిత, రాజేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

సరైన పత్రాలు కలిగి ఉండాలి



హనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్

కన్నాయిగూడెం: వాహనదారులు సరియైన పత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఎస్సై సురేష్ అన్నారు. మండలంలోని గంగగూడెంలో ప్రధాన రహదారిపై శనివారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. తుపాకులగూడెం, ఏటూరునాగారం, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిపోయో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేశారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన దుక్కిటెద్దు

వెంకటాపురం(ఎం): విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని ఆకులవారిపల్లెలో శనివారం చోటుచేసుకుంది. గంధం హరీష్‌కు చెందిన దుక్కిటెద్దు సాయంత్రం 4 గంటలకు పచ్చిక మేసేందుకు వెళ్లింది. పొలం ప్రక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ఎర్త్‌వైరుకు తాకి విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపారు. ఎద్దు విలువ రూ. 40 వేలు ఉంటుందని, సంబంధిత శాఖ అధికారులు, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మోదీ సభకు తరలిన నాయకులు

వెంకటాపురం(ఎం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వరంగల్ వస్తున్న నేపథ్యంలో మండలంలోని బీజేపీ శ్రేణులు శనివారం తరలివెళ్లారు. మండలాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, యాదగిరి, శోభన్, తిరుపతిరెడ్డి, దేవేందర్, సంతోష్, వినోద్ తదితరులు ఉన్నారు.

‘వల్స’ బలగం



ఆత్మీయ సమ్మేళనంలో వల్స కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన వల్స కుటుంబ సభ్యులు శనివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. బలగం సినిమా వచ్చిన తర్వాత కుటుంబ సభ్యుల్లో ప్రమానురాగాలు పెరిగాయి. ఈ మేరకు వల్స కుటుంబ సభ్యులంతా బలగంగా మారారు. వల్స బతుకయ్య, సమ్మక్క కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ముఖ్య అతిథిగా సమ్మక్క మునిమనువడు అమెరికాలో స్థిరపడిన వల్స నాగరాజు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో వల్స శ్రీనివాస్, కలర్ షాపు అధినేత వల్స మధు, కుమార్తెలు, కుమారులు కలిసి వారి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్

వాజేడు: స్థానిక పీహెచ్‌సీలో క్షయ వ్యాధి గ్రస్తులకు శనివారం వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బియ్యం, న్యూట్రీషియన్ కిట్లు, గుడ్లు, నూనె ప్యాకెట్, కంది పప్పు మొదలైన సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య పర్య వేక్షకుడు కోటిరెడ్డి, రజనీకాంత్, స్టాఫ్ నర్సులు ఉన్నారు.